# 1400 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు

- పాలమూరు - రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్, పెండింగ్ ప్రాజెక్టుల పనులు వేగవంతం
- గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రాధాన్యతనిచ్చి.. మిగతా ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసింది
- రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి
- అజిలాపురం లిఫ్ట్ ఇరిగేషన్‌కు శంకుస్థాపన చేసిన మంత్రులు, ఎమ్మెల్యే



మాట్లాడుతున్న నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి



రూ. 32 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు, ఎమ్మెల్యే, కలెక్టర్

**దేవరకద్ర, మే 30 ప్రభాతవార్త:** ఉమ్మడి పాలమూరు జిల్లాలో పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుతో పాటు అన్ని పెండింగ్ ప్రాజెక్టులు వేగవంతం చేసి చరిత్రలో నిలిచి పోయే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తుందని రాష్ట్ర నీటి పారుదల శాఖ,పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు.శనివారం దేవరకద్ర నియోజకవర్గంలో దేవరకద్ర మండలంలో 32.05కోట్ల రూపాయలతో నిర్మాణం చేయనున్న అజిలా పూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి రాష్ట్ర పశు సంవర్ధక,మత్స్య శాఖ,శాఖ మంత్రి వాకిటి శ్రీ హరి,రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులుజి.చిన్నారెడ్డి,దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ అజిలాపురం లిఫ్ట్ ఇరిగేషన్ పనులు శంకుస్థాపన చేయడంసంతోషంగా ఉందని,ఈ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ వలన అజిలా పురం,గద్దె గూడెం, వెంకటాయ పల్లి గ్రామాలకు 1400 ఎకరాల ఆయకట్టుకు కోయిల్ సాగర్ సోర్స్ నుండి సాగు నీరు అందుతుందని తెలిపారు. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి ప్రాధాన్యత నిచ్చి ఉమ్మడి పాలమూరు జిల్లాలో పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుతో పాటు కల్వకుర్తి,నెట్టెంపాడు,భీమా,తదితర ప్రాజెక్టులనునిరక్ష్యం చేసిందని తెలిపారు. పాలమూరు రంగా రెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ 90 శాతం పూర్తి చేశామని చెప్పటం అబద్ధం అన్నారు. ఒక్క ఎకరా ఆయకట్టుకు నీరు ఇవ్వలేదని అన్నారు. జూన్ 4,5 తేదీల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డితో పాటు తాను ఉమ్మడి జిల్లాలో నిర్మాణంలో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ పనులు,పెండింగ్ పనులు పరిశీలించి, అవసరమైన నిధులు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. జూన్ 4న జూరాల నుండి ప్రారంభించి 4,5 తేదీల్లో కల్వకుర్తి, నెట్టెంపాడు,భీమా,నార్లాపూర్,ఉద్దండాపూర్ రిజర్వాయర్‌లను సిఎం,తాను పర్యటించి భూ సేకరణ,పెండింగ్ పనులకు ఎన్ని వేల కోట్ల నిధులైనా మంజూరు చేసి పూర్తి చేయనున్నట్లు తెలిపారు.ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ల నిర్మాణం భూ సేకరణకు,ఆర్ఆర్, పెండింగ్ బిల్లులు నిధులు విడుదల చేసి ఇరిగేషన్ ప్రాజెక్ట్ పెండింగ్. పనులు,పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు వేగవంతం చేస్తామని ఆయన పేర్కొన్నారు.ఉమ్మడి పాలమూరు జిల్లాలో కొడంగల్ నారాయణ పేట,కల్వకుర్తి,నెట్టెంపాడు,భీమా,కోయిల్‌సాగర్,పాలమూరు రంగా రెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పెండింగ్ పనులు ప్రభుత్వం వచ్చే రెండున్నర సంవత్సరం ల కాలంలో పూర్తి చేస్తామని ప్రకటించారు. స్థానిక శాసన సభ్యులు జి.మధు సూదన్ రెడ్డి కోరిన విధంగా చౌదరి పల్లి లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేస్తానని సానుకూలంగా స్పందించారు. దేవరకద్ర శాసన సభ్యులు జి.మధు సూదన్ రెడ్డి మాట్లాడుతూ కోయిల్‌సాగర్ కాలువల మరమ్మతులకు 150 కోట్లు మంజూరు చేయాలని, 22 వేల ఎకరాలకు అదనంగా సాగు నీరు. అందించ వచ్చని తెలిపారు. రూ. 87 కోట్ల చౌదరి పల్లి లిఫ్ట్ ఇరిగేషన్ కు ప్రతిపాదనలు పంపాం అనుమతులు మంజూరు చేయాలని మంత్రికి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

**కొనుగోలు కేంద్రం సందర్శన:** అజిలాపూర్ శివార్‌లో ఏర్పాటు చేసిన పిఏసిఎస్ కొనుగోలు కేంద్రాన్ని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,వాకిటి శ్రీ హరిలు సందర్శించారు. కొనుగోలు కేంద్రం లో కొనుగోళ్లు, ఎంఎస్‌పి చెల్లింపు పై రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తూ ఎంఎస్‌పి రైతుల ఖాతాల్లో జమ అవుతున్నట్లు వారు –మిగతా4లో..

మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట



## నియోజకవర్గానికి ఓ మహిళా సూపర్ మార్కెట్

- మహిళలను విజయవంతమైన వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యం
- ఇది ఒక చారిత్రాత్మక నిర్ణయం : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహిళా సంఘాల సభ్యులతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్ బ్యూరో, మే 30, ప్రభాతవార్త :** మహిళల ఆర్థిక సాధికారతకు తోడ్పడేలా రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని, ప్రతి నియోజకవర్గంలో మహిళా శక్తి సూపర్ మార్కెట్లు " ఏర్పాటు చేసి,మహిళా సంఘాల సభ్యులను భాగ స్వాములుగా,షేర్‌హోల్డర్లుగా చేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ నగరంలోని బృందావన్ క్లాసిక్ గార్డెన్‌లో నిర్వహించిన 99రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సూపర్ మార్కెట్లను మహిళలే నిర్వహిస్తూ, వారి అవసరాలకు అనుగుణంగా సేవలు అందించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది మహిళలకు ఉపాధి, గౌరవం కలుగుతుందని ఆయన చెప్పారు. మహిళలను భాగస్వాములుగా చేస్తే ఈ వ్యవస్థ భవిష్యత్తులో పెద్ద కార్పొరేట్ సంస్థగా ఎదగగలదని ఎమ్మెల్యే సూచించగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి, వెంటనే విధివిధానాల రూపకల్పనకు అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. రాబోయే రోజుల్లో ప్రతి జిల్లా, నియోజకవర్గంలో మహిళా శక్తి సూపర్ బజార్లు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తక్కువ లీజుతో ప్రభుత్వ స్థలాలు ఇవ్వడం, రిటైల్ రంగంలో శిక్షణ అందించడం ద్వారా మహిళలను విజయవంతమైన –మిగతా4లో..

## ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

- వారంలోపు కొనుగోలు పూర్తి
- దేశంలోనే ధాన్యం కొనుగోలులో తెలంగాణ రాష్ట్రం నంబర్ వన్
- తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి గోదాములకు తరలింపు
- రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి




మహిళా సంఘాల సభ్యులకు చెక్కులు అందజేస్తున్న మంత్రి




మాట్లాడుతున్న మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 30, ప్రభాతవార్త :** ఉమ్మడి మహబూబ్ నగర్‌జిల్లాకు సంబంధించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను వారం రోజుల్లో జూన్ 4,5 తేదీలోగా పూర్తి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు.శనివారం మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలకు సంబంధించిన ధాన్యం కొనుగోలు అంశంపై రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు,రాష్ట్ర పశు సంవర్ధక,మత్స్య,పాడి అభివృద్ధి,క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రివాకిటి శ్రీ హరి,రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నా రెడ్డి లతో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్,డిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి జితేందర్ రెడ్డి,ప్రభుత్వ విప్,మహబూబ్ నగర్ శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి,దేవరకద్ర శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి, జడ్చర్ల శాసన సభ్యులు జె.అనిరుధ్ రెడ్డి,నాగర్ కర్నూల్ శాసన సభ్యులు కూచుకుళ్ళ రాజేష్‌రెడ్డి,అచ్చం పేటశాసన సభ్యులు చిక్కుడు వంశీ కృష్ణ రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర,రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్, మహబూబ్ నగర్,నాగర్ కర్నూల్,నారాయణ పేట,గద్వాల,వనపర్తి జిల్లాల కలెక్టర్లు ఖుష్బూ గుప్తా,హేమంత్ కేశవ్ పాటిల్,సి.హెచ్.ప్రియాంక, ఆదర్శ్‌సురభి,రిజ్వాన్‌బాషా షేక్,అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలకు చెందిన కలెక్టర్లు ధాన్యం, మొక్క జొన్న కొనుగోలు, నిల్వ,రవాణా ప్రక్రియలపై మంత్రులకు వివరించారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని పలు ఉమ్మడి జిల్లాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ను వేగవంతం చేసేందుకు జిల్లా ఇంచార్జి మంత్రులు,జిల్లా మంత్రులు,ఎమ్మెల్యేలు, తదితరులతో కలిసి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సారథ్యం లోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతుల పక్షపాత ప్రభుత్వం అని పేర్కొన్నారు.దేశంలో ఎక్కడా లేని 29 రాష్ట్రాల్లో రైతులకు మేలు చేసింది తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం అన్నారు.దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అత్యధిక వరి ధాన్యం పండించి తెలంగాణ రాష్ట్రం దేశం లో నంబర్ వన్ రాష్ట్రంగా నిలిచిందని తెలిపారు. వరి,మొక్క జొన్న ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలిపారురైతులు నష్ట పోకుండా తడిసిన ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేసి బాయిల్డ్ మిల్లులకు తరలించినట్లు తెలిపారువాతావరణ శాఖ జూన్4వ తేదీ తర్వాత వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించిన నేపథ్యంలో వారం రోజుల్లోగా –మిగతా4లో..

## సజావుగా వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు

- గత 15 రోజుల్లో ఆరు లక్షల సంచుల ధాన్యం మిల్లులకు తరలింపు
- వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రాష్ట్రంలోనే జోగులాంబ గద్వాల జిల్లా ముందంజ
- గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల మే 30, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లాలో వరిధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తనతో పాటు అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికార యంత్రాంగం ఆయా కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించడంతో రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేశామన్నారు. ఇప్పటి వరకు జరిగిన వరి ధాన్యం కొనుగోలులో జోగులాంబ గద్వాల జిల్లా రాష్ట్రంలోనే మందంజలో నిలిచిందన్నారు. గత 15 రోజులుగా 6 లక్షల దాన్యం సంచులను మిల్లులకు తరలించడం జరిగిందన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో మొత్తం 76వరి ధాన్యం కొనుగోలు –మిగతా4లో..

## బాలికలలో నాయకత్వ లక్షణాలు అవసరం

- స్థానిక సమస్యల పరిష్కారానికి నాయకత్వంగా వ్యవహరించాలి
- కిషోర బాలికలకు సైకిళ్లు పంపిణీ చేస్తాం
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్
హాజరైన కిశోర బాలికలు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 30 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మే 25 నుండి 30వ తేదీ వరకునిర్వహించిన మహిళా వారోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్నేహకిశోర బాలికల సంఘాల ప్రతినిధుల మాక్ పార్లమెంట్, అవగాహన సదస్సు కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.జిల్లా గ్రామీణ అభివృద్ధిసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థినుల ప్రతిభను ప్రశంసిస్తూ, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన డిఆర్‌డిఏ అధికారులకు అభినందనలు తెలిపారు. ప్రజావాణి సమావేశ మందిరం అంతా విద్యార్థినుల ఉత్సాహభరిత ప్రసంగాలు, చర్చలతో పార్లమెంటరీ ప్రజాస్వామ్య వాతావరణాన్ని తలపించింది. ఈ మాక్ పార్లమెంట్ ప్రత్యేక ఆకర్షణగాబాలికలు వివిధ రాజ్యాంగ పదవులను స్వయంగా నిర్వహించడం విజయవంతంగా నిలిచింది. రాష్ట్రపతిగా జ్ఞానేశ్వరి బాధ్యతలు స్వీకరించగా, లోక్‌సభ స్పీకర్‌గా యమున సభను సమర్థవంతంగా నిర్వహించారు. ప్రధానమంత్రిగా నందిని ప్రభుత్వ పక్ష చర్చలను ముందుండి నడిపించగా, లోక్‌సభ ప్రతిపక్ష నాయకురాలిగా నిఖిత ప్రభుత్వ విధానాలపై సూటిగా ప్రశ్నలు సంధించారు. డిప్యూటీ స్పీకర్‌గా ప్రియాంక సభా నియమాలను పాటింపజేస్తూ చర్చలను సమన్వయం చేశారు.అలాగే వివిధ శాఖల మంత్రుల పాత్రల్లో ఇతర స్నేహ కిషోర బాలికలు పాల్గొని, హోమ్, ఆరోగ్యం, విద్య, గ్రామీణ అభివృద్ధి, మహిళా భద్రత, బాల్య వివాహాల నివారణ, ప్రభుత్వ పథకాల అమలువంటి అంశాలపై చర్చలు నిర్వహించారు. ప్రతి అంశంపై విద్యార్థినులు తమ అభిప్రాయాలను స్పష్టంగా, ధైర్యంగా వ్యక్తం చేయడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ మహిళా వారోత్సవాల ప్రధాన లక్ష్యం బాలికల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, వారికి స్వీయ అవగాహన కల్పించడం అని తెలిపారు. బాలికలు చిన్న వయస్సులోనే ప్రజాస్వామ్య వ్యవస్థ పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకోవడం భవిష్యత్ నాయకత్వానికి బలమైన పునాది అవుతుందని కలెక్టర్ తెలిపారు. బాలికలు వాక్చాతుర్యంతో నిర్భయంగా మాట్లాడడం ఒక వేదిక అవసరమని, ఇలాంటి వేదికల ద్వారా బాలికల సృజనాత్మకత సమయస్ఫూర్తి మంచి నాయకత్వ లక్షణాలు వాక్చాతుర్యం వంటి ప్రతిభ లు వస్తుంటాయని కలెక్టర్ తెలిపారుస్నేహ కిషోర బాలికల –మిగతా4లో..

## బాల్య వివాహాల రహిత జిల్లాగా పేటను తీర్చిదిద్దుదాం

- నారాయణపేట జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ

**నారాయణపేట, మే 30ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగాకృషి చేయాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక పిలుపునిచ్చారు. బాలికల విద్యాభివృద్ధి ద్వారానే బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించడం సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ), గ్రామీణ పేదరికనిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో "అమ్మకు అక్షరమాల" కార్యక్రమం, స్నేహ సంఘాల ద్వారా మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.వినీత్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కిశోర బాలికల సంఘాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.బాలికలు ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈసారి పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులుబాలికలే కావడం గర్వకారణమన్నారు. పదో తరగతి ఫలితాల్లో బాలికలు ప్రతిభ కనబరుస్తున్నప్పటికీ, ఉద్యోగ అవకాశాల్లో మాత్రం వెనుకబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదో తరగతి తర్వాత తీసుకునే నిర్ణయాలువారి భవిష్యత్తును ప్రభావితం చేస్తాయని,విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. "అమ్మకు అక్షరమాల" కార్యక్రమం ద్వారా వయోజనులకు విద్యాబోధన చేస్తున్న వీవోలకు అభినందనలు తెలిపారు. జిల్లాలో మహిళా అక్షరాస్యత మరింత పెరగాలని ఆకాంక్షించారు. జిల్లా ఎస్పీ డా.వినీత్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన కోసం మిషన్ మోడ్‌లో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు అన్ని ప్రభుత్వ శాఖల సహకారం ఉంటుందని తెలిపారు.బాలికలు తమ హక్కుల కోసం తాము పోరాడటమే కాకుండా, తమ తోటి స్నేహితురాళ్ల కోసం కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.మహిళల విద్యతోనేసమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అంతకుముందు బాల్య వివాహాల నిరోధక చట్టంపైమాక్ పార్లమెంట్ నిర్వహించినకిశోర బాలికలను కలెక్టర్, ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. విధుల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సీసీలు,సిబ్బందికి ప్రశంసా పత్రాలుఅందజేశారు.డీఆర్‌డీఏ పీడీ వెంకట్‌రాములు,జడ్పీ సీఈవో శ్రీనివాస్‌రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జయచంద్రమోహన్, డీఈవో గోవిందరాజులు, డీపీఎంలు, ఏపీఎంలు తదితర అధికారులు పాల్గొన్నారు.


## బాల్య వివాహాలను వ్యతిరేకించాలి

- విద్యార్థినులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి
- కిశోర బాలికల కోసం ప్రత్యేక సంఘాలు ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరం : వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి, మే 30, ప్రభాతవార్త:** అమ్మాయిలు బాల్యవివాహాలను వ్యతిరేకిస్తూ, సమాజంలో అన్ని అంశాలపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. శనివారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్నేహ (కిషోర బాలికల సంఘాలు)కు జిల్లా గ్రామీణ అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీతారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బాలికలు ప్రధాన మంత్రి, స్పీకర్, ఎంపీల పాత్రలను ఎంతో ఉత్సాహంగా పోషిస్తూ పార్లమెంట్ సమావేశాన్ని నిర్వహించారు. మహిళా సంక్షేమం, మహిళల ఆరోగ్యం, అభివృద్ధి, వరి కొనుగోలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పలు సామాజిక అంశాలపై చర్చించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ కిశోర బాలికల కోసం ప్రత్యేక సంఘాలు ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమని అన్నారు. సమాజంలో ఐక్యత చాలా ముఖ్యమని, బాలికల కోసం మాక్ పార్లమెంట్ నిర్వహించడం మంచి సాధనగా అభివర్ణించారు. సమావేశంలో విద్యార్థినులు మహిళల్లో రక్తహీనత, సమాజంలో జరుగుతున్న పలు సమస్యలపై ప్రశ్నలు అడగడం అభినందనీయమని అన్నారు. పార్లమెంట్‌లో చర్చించినట్లుగా ప్రతి ఒక్కరూ రక్తహీనత పరీక్షలు చేయించుకోవాలని, ఆరోగ్యంగా, బలంగా ఉండాలని సూచించారు.బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని, వాటిపై గళం వినిపించాలని అన్నారు. ఉన్నత విద్య పూర్తి చేసిన తర్వాతే వివాహం చేసుకోవాలని సూచించారు. గత మూడు సంవత్సరాల్లో జిల్లాలో 60 బాల్య వివాహాలు జరిగినట్లు తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహ సమాచారం తెలిసిన వెంటనే 1098 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని కోరారు. విద్యార్థినులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి మాట్లాడుతూ బాలికలు మధ్యలో చదువులు మానేయకుండా ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. బాలికలకు విద్యనే అత్యంత ప్రాధాన్యత కావాలని, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని లక్ష్యాలను సాధించాలని అన్నారు. ప్రస్తుత కాలంలోబాలికలకు అనేక సవాళ్లు ఉన్నాయని, వాటిని అవగాహనతో అధిగమించాలని సూచించారు. యాంటీ సోషల్ ఎలిమెంట్స్ వలలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని, ప్రతి ఒక్కరికీ –మిగతా4లో..



హాజరైన కిశోర బాలికల సంఘాలు

## ప్రజల భద్రతలో రాజీ లేదు

- ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలి
- కేసుల దర్యాప్తునందు నాణ్యత ప్రమాణాలు పాటించాలి
- రాత్రి సమయాలలో రోడ్లపై తిరిగే వారినీ కట్టడి చేయండి
- వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సునిత రెడ్డి

**వనపర్తి, మే30, ప్రభాతవార్త:** జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ..ప్రజల విశ్వాసమే పోలీసు శాఖకు అతిపెద్ద బలం.ప్రతి పోలీసు అధికారి ప్రజలకు చేరువగా ఉంటూ, వారి సమస్యలను తెలుసుకొని వెంటనే స్పందించాలి. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నివారణ, సైబర్ మోసాల అరికట్టడం, గ్రామ స్థాయిలో భద్రతా వ్యవస్థను బలోపేతం చేయడం ప్రతి పోలీసు అధికారి బాధ్యతని జిల్లా ఎస్పీ సునితరెడ్డి, పేర్కొన్నారు. శనివారంరోజు జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ భవనంలో జిల్లాలోని డిఎస్పీలు, సీఐలు,అన్ని పోలీస్టేషన్ల ఎస్సైలతో జిల్లా ఎస్పీ నెలవారి నేరసమీక్షా సమావేశం నిర్వహించి పెండింగ్ కేసులు తెలుసుకొని చాలాకాలం నుండి పెండింగ్‌లో ఉన్నటువంటి కేసులను సంబంధిత అధికారులు పూర్తి చేయాలని, పెండింగ్ ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్,నాన్‌గ్రేవ్ కేసులకు సంబంధించిన డాక్యుమెంట్స్ నీలీలి రిపోర్ట్స్, మెడికల్ సర్టిఫికెట్ త్వరగా తెప్పించి కేసులు ఛేదించాలన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఎస్సైతమ పరిధిలోని గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించి, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలి. గ్రామ పోలీసు అధికారులు తామందుకున్న గ్రామాలపై పూర్తి అవగాహనతో ఉండి,ముందస్తు సమాచార సేకరణపై దృష్టి పెట్టాలి.రౌడీ షీటర్స్, సస్పెక్ట్‌ల కదలికలపై నిఘా ఉంచాలి. బ్లూకోల్ట్స్ నైట్ పెట్రోలింగ్ సిబ్బంది ఫింగర్ ప్రింట్ డివైస్‌లు వినియోగించి అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరించాలి.ఆన్లైన్‌సైబర్ మోసాలపై ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలి. గుర్తు తెలియని నంబర్ల నుండి వచ్చే వీడియో కాల్స్, డిజిటల్ అరెస్టులు, పోలీస్ పేరుతో వచ్చే మోసపూరిత కాల్స్‌ను నమ్మకూడదని ప్రజలకు తెలియజేయాలి.మోసాలకు గురైన వెంటనే, మొదటి గంటలోపే ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పించాలి, సమాజ భద్రతలో సిసి కెమెరాల ప్రాధాన్యత ఎంతోఉందని, ప్రతి గ్రామం, వీధి, పరిశ్రమలు, పవిత్ర స్థలాల్లో కమ్యూనిటీ సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇంటికి ఏర్పాటు చేసిన కెమెరాల్లో వీధి దిశకు ఎదురుగా ఉన్నవాటిని కూడా జియో ట్యాగింగ్ చేయించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎస్సైలకు సూచించారు.100 డయల్ కాల్స్‌కు త్వరితగతిన స్పందిస్తూ, ప్రజల నమ్మకాన్ని మరింతగా పెంపొందించుకోవాలని ఎస్పీ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపడానికి –మిగతా4లో..

# రైతు పండించిన ప్రతి గింజను కొంటాం..

- రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- తేమశాతంపై అపోహలు వద్దు
- మిల్లర్లు కొర్రీలు పెడితే ఉపేక్షించేది లేదు
- రవాణా వ్యవస్థ మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ పాటిల్



లక్ష్మాపూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్



మామిళ్ళపల్లిలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన కలెక్టర్

**ఉప్పునుంతల , మే 30 ప్రభాతవార్త :** రైతులు పండించిన ప్రతి పంట గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ పాటిల్ అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్దనే అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తేమ శాతంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మిల్లర్లు కొర్రీలు పెడితే వారిపై చర్యలు తప్పవని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తీసుకున్న తేమశాతాన్ని పరిగణలోకి తీసుకుంటామని మిల్లర్ల వద్ద తేమశాతం పరీక్షించొద్దన్నారు. సెంటర్ల వద్ద ధాన్యం క్లీనింగ్ మిషన్లు ఏర్పాటు చేశామని ఎప్పటికప్పుడు ధాన్యాన్ని శుభ్రపరచుకోవాలని రైతులకు సూచించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం, గ్రామీణాభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి, వరి కొనుగోలు కేంద్రాల తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన, ఉప్పునుంతల మండలంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై క్షేత్రస్థాయి పరిశీలన, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సూచించారు. శనివారం ఉదయం అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని ఉప్పునుంతల మండలంలోని మామిళ్ళపల్లి, లక్ష్మాపూర్ గ్రామాలను సందర్శించిన కలెక్టర్ వివిధ ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించారు. ముందుగా మామిళ్ళపల్లి గ్రామంలోని చెరువు కట్టపై కొనసాగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించి, పనుల నాణ్యత, కార్మికుల హాజరు, వేతనాల చెల్లింపులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశగా పనులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్, లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి నిర్మాణాల పురోగతి, ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణాలను నిర్ణీత గడువులో పూర్తి చేసి అర్హులైన కుటుంబాలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండరాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో కొనసాగుతున్న జనాభా గణన ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, ప్రభుత్వ ప్రణాళికల రూపకల్పనలో జనాభా గణాంకాలు కీలకమని సిబ్బందికి సూచించారు. జూన్ 1వ తేదీ నాటికి జిల్లాలో మొదటి విడత జనగణన ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. తదనంతరం మామిళ్ళపల్లి, లక్ష్మాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ రైతులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, తూకం, చెల్లింపుల విధానంపై వివరాలు తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించడంతో పాటు రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వరి కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు, నిల్వ ఏర్పాట్లు, రికార్డుల నిర్వహణను పరిశీలించిన కలెక్టర్, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రైతులు తమ పంటకు గిట్టుబాటు ధర పొందేలా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే ఎంపిక చేసిన మిల్లులకు తరలించేందుకు అవసరమైన లారీలను అందుబాటులో ఉంచాలని సూచించారు. అంతకుముందు మామిళ్ళపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని సందర్శించారు .కలెక్టర్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత, చారిత్రక ప్రాధాన్యతపై ఆలయ అర్చకులను అడిగి తెలుసుకున్నారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పన తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తో పాటు తహసీల్దార్ అద్దంకి సునీత, ఉప తహసీల్దార్ రమేష్, ఎంపిడిఓ వరుణ్ తేజ, మండల విద్యాశాఖాధికారి చంద్ర శేఖర్, మండల వ్యవసాయ శాఖ అధికారి కొర్ర రమేష్, ఈజీఎస్ ఏపీఓ పర్వతాలు, మామిళ్ళపల్లి ఆలయ కమిటీ చైర్మన్ వేముల నరసింహారావు, ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ దమయంతి, జనాభా గణన సూపర్వైజర్ కట్ట మల్లారెడ్డి, సింగిల్ విండో సిఇఒ కొత్త రవీందర్ రావు, ఎఎస్ఒ సాయి ,సర్పంచులు మోహన్ గౌడ్, గోపాల్, సాయి బాబు గౌడ్, ఐసిడిఎస్ సూపర్వైజర్ లు బిపాసా, పావని, ఈజీఎస్ సిబ్బంది జి. కుర్మా రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ ఉమా పతి చారి, జిపిఓ లు ఆంజనేయులు, రాము, మండల విస్తీర్ణ అధికారిణి లక్ష్మీ రాఘు పులిజాల, మాజీ వైస్ ఎంపీపీ కాల్వ గోవర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ మర్యాద దామోదర్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## అమ్మ మాట అంగన్‌వాడీ బాట విజయవంతం

**అచ్చంపేట, మే,30 ప్రభాతవార్త:** పట్టణంలో జూబ్లీ నగర్ అంగన్‌వాడి మూడవ కేంద్రం ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్ వాడి బాట కార్యక్రమం నిర్వహించడం జరిగిందని సూపర్‌వైజర్ సువర్ణ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్ వాడీ కేంద్రంలో అడ్మిషన్లు ప్రారంభం అయ్యావని అంగన్ వాడిలో మూడు సంవత్సరాల నుండి ఐదు సంవత్సరాలలోపు చిన్నారులను చేర్పించే విధంగా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. అన్ని వసతులతో కూడిన తెలుగు ఇంగ్లీష్ మీడియంవిద్యతోపాటు విద్యార్థులకు పౌష్టికా హారం అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం విద్యారంగా సర్టిఫికెట్ చిన్నారుల అసెస్మెంట్, చిన్నారులకు రెండు జతల డ్రస్సులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు హైమావతి, సంధ్య, షాహేద, సంతోషి, భారతి,సుగుణ, చంద్రకళ, రమ, హాలీమా, తిరుమల, విజయ, మేఘమాల, జయ, లక్ష్మి జి.లేఖ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులు బదిలీలు

**చిన్న చింతకుంట, మే30 ప్రభాతవార్త :** మండలంలోని ఒక సీనియర్ అసిస్టెంట్, ఏడుగురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు. మండల పరిషత్ లో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న మద్దిలేటి వడ్డేపల్లి మండల పరిషత్ కు బదిలీ అయ్యారు. బండర్ పల్లి పంచాయతీ కార్యదర్శి జోగి నరసింహులు దేవరకద్ర మండలం గద్దెగూడెం, అల్లిపూర్ పంచాయత్ కార్యదర్శి సత్యవతి అడ్డాకుల మండలం తిరునాయపల్లి, సీతారాంపేట్ పంచాయతీ కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, దేవరకద్ర మండలం జీనుగరాలకు, చిన్న వడ్డేమాన్ పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవులు, కోయిలకొండ మండలం తిరుమలం పల్లి కు, గోపియా నాయక్ తండ పంచాయతీ కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, కౌకుంట్ల మండలం పుట్టపల్లి, పర్దిపూర్ పంచాయతీ కార్యదర్శి కురుమన్న దేవరకద్ర మండలం చిన్న రాజమూరుకు, మండల పరిషత్ అటెండర్ ఆనంద్, కోయిలకొండ మండలం పారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు బదిలీ అయినట్లు ఎంపీడీవో లక్ష్మి నరసింహులు తెలిపారు.

## సీనియర్ అసిస్టెంట్ నారాయణ దాతృత్వం

**ఆలయానికి రూ. 35 వేల ఎలక్ట్రానిక్ సామాగ్రి వితరణ**



**నవాబుపేట, మే 30 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మహిమాన్విత మైసమ్మ ఆలయానికి నవాబుపేట మండల కేంద్రం తహసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పెనుమ నగండ్ల గ్రామానికి చెందిన నారాయణ మైసమ్మ ఆలయానికి రూ.35వేల విలువగలఎలక్ట్రానిక్ సామాగ్రి ఫ్యాన్లు ఆలయ సిబ్బందికి శనివారం అందజేశారు. భక్తులకు ఆలయ ప్రాంగణంలో అమర్చడానికి ఫ్యాన్లు ఫ్యాన్లు ఉపశమనం కలిగించేలా ఉపయోగపడతాయని ఆయనకు అమ్మవారి పై ఉన్న భక్తితో ఎలక్ట్రానిక్ పరికరాలు అందజేశారని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది మాట్లాడుతూ భక్తితో కానుకల రూపమే కాకుండా ఇలా ఆలయానికి దాతలు ముందుకు వచ్చి భక్తులకు కావలసినసామాగ్రిని వితరణ చేయడం చాలా సంతోషమని సీనియర్ అసిస్టెంట్ నారాయణకు ఆలయ సిబ్బంది భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైసమ్మ ఆలయ సిబ్బందితోపాటు కెనెమోని వెంకటేష్, కనెమోని శంకర్ ,మచనమోని భాస్కర్, నాని.ప్రసాద్, పాతూర్ శ్రీను పాల్గొన్నారు.

## మాధ్వార్‌లో తాగునీటి ఎద్దడికి చెక్

**సర్పంచ్ డా. శ్రీనివాస్ రెడ్డి చొరవతో నూతన బోరు ఏర్పాటు**



బోరు పనులను ప్రారంభించిన సర్పంచ్ డా. శ్రీనివాస్ రెడ్డి

**మక్తల్ టౌన్, మే 30 ప్రభాతవార్త:** మక్తల్ మండలం మాధ్వార్ గ్రామంలో గత కొంతకాలంగా నెలకొన్న తీవ్ర తాగునీటి సమస్యకు సర్పంచ్ డా. శ్రీనివాస్‌రెడ్డి చొరవతో పరిష్కారం లభించింది. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న నీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని శనివారం గ్రామంలో నూతన బోరు తవ్వింపు పనులను ఆయన చేపట్టారు. వేసవి తీవ్రతతో గ్రామంలోని పలు కాలనీల్లో తాగునీటి కొరత ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై గ్రామస్తులు సర్పంచ్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించిన డా. శ్రీనివాస్ రెడ్డి సంబంధిత అధికారులతో చర్చించి బోరు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ డా. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ "గ్రామ ప్రజలకు తాగునీటి కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటాం. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే మా ప్రధాన లక్ష్యం. భవిష్యత్తులో కూడా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం" అని తెలిపారు. అనంతరం గ్రామంలోని అంగన్ వాడీ చిన్నారులకు దుస్తులనుపంపిణీ చేశారు. సర్పంచ్ తక్షణమే స్పందించి నీటి సమస్య పరిష్కరించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ నూతన బోరు ద్వారా గ్రామంలోని పలు కుటుంబాలకు తాగునీరు అందుబాటులోకి రానుంది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కె. శివాని, డా. ఆశప్ప, గ్రామపెద్దలు రాజేశ్వర్‌రావు, గాలరాములు, బుడబోయి చంద్రప్ప ,గుడిసె రాజు, వార్డు మెంబర్‌బాటనరసింహ, గణపురం నాగేష్, బాటరాజు, బుడబోయి రాములు, పంచాయతీ సిబ్బంది నరేష్, నరసప్ప, బాటజంగంనరసింహ, గ్రామ యువకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త మృతి

**పెద్దమందడి, మే30 ప్రభాతవార్త:** పెద్దమందడి మండలం పామ్రేడ్పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త పానుగంటి సామాన్యులు తన సొంత వ్యవసాయ పొలంలో పనులు చేసుకుంటున్న సమయంలో అకస్మాత్తుగా అస్వస్థతకు గురై మృతి చెందారు. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. శనివారం సామేలు మరణ వార్త తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే తుడిమేగారెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగేబాధ్యత కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం రూ.5000 పార్టీ కార్యకర్తల ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ సామేలు పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా నిస్వార్థంగా సేవలందించారని ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని పార్టీ తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుమ్మ వెంకట్ స్వామి, గ్రామ సర్పంచ్ మధిర మంజుల, శ్రీశైలం వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



సామేలు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన శ్రీశైలం

## పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నాం..

**●దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి**



లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**చిన్న చింతకుంట, మే30 ప్రభాతవార్త:** పేద వర్గాల సొంతింటి కలను ప్రజా ప్రభుత్వం నెరవేస్తున్నామని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం దమగ్నాపూర్ లో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. గతంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు ఇప్పటివరకు నిర్మించుకోలేని వారు స్వచ్ఛందంగా మాకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను రద్దుచేసి ఇతరులకు ఇవ్వాలని మాకు రెండో విడత లేదా మూడో విడతలో మంజూరు చేయాలని విజ్ఞప్తి మేరకు గృహాలకు సంబంధించిన లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ప్రజా ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గాల సంక్షేమానికై అహర్నిశలు పనిచేస్తున్నామని ఆయన తెలిపారు. ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి అట్టివారికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిగూడు నిర్మించి ఇస్తున్నామన్నారు. ప్రజా ప్రభుత్వంలోనే పేదలసంక్షేమం జరుగుతుందన్నారు. చిన్నచింతకుంటకు (13) అమ్మాపూర్ (3) గోపియా నాయక్ తండ (3) అల్లిపూర్(01)లాల్ కోట (01) ఇందిరమ్మ గృహాలు మంజూరైనట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మి నరసింహులు, హౌసింగ్ ఏఈ సందీప్, సర్పంచులు రంజిత్ కుమార్ ,గోపాల్, కురుమూర్తి దేవస్థాన చైర్మన్ బత్తుల బాలరాజ్, మాజీ సర్పంచ్ వెంకటేష్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎస్ వెంకటేష్, మహమూద్, శేఖర్, గూడూరుశేఖర్, సురేష్, ప్రతాప్, చాకలి అశోక్, గౌస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సమ్మర్ కబడ్డీ శిక్షణ శిబిరం

**ఉప్పునుంతల, మే 30 ప్రభాతవార్త:** మండలంలోని వెల్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత 30 రోజులుగా కొనసాగుతున్న సమ్మర్ కబడ్డీ శిక్షణ శిబిరం విజయవంతంగా కొనసాగుతుంది. హై స్కూల్ ఆవరణలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో 40 మంది విద్యార్థులు కబడ్డీ శిక్షణ పొందుతున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్ తెలిపారు. గ్రామంలో గ్రామ సర్పంచ్ తో పాటు యువత సమ్మర్ కబడ్డీ శిక్షణ శిబిరానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. శిక్షణ పొందేందుకు క్రీడాకారుల సంఖ్యరోజు రోజుకు పెరుగు తుండడంతో క్రీడల్లో ముందుండాలనే లక్ష్యంతో గ్రామ యువత ప్రోత్సాహం అందిస్తున్నారు. మండల కేంద్రంలో క్రీడారంగంలో వెనుకబడిపోయిన వెల్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో శిక్షణ పొందిన కబడ్డీ క్రీడాకారులు రాష్ట్రస్థాయి వరకుఎంపిక కావడం అభినందనీయమని మండల ప్రజలు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. మండల కేంద్రంలో ఉన్న పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడారంగంలో పూర్తిగా వెనుకబడి పోయారు. విద్యార్థులకు క్రీడలపట్ల ఆసక్తి పెంపొందించే వారు లేకపోవడంతో క్రీడల్లో వెనుక బడడం చాలా బాధాకరమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వెల్టూర్ హైస్కూల్లో క్రీడా ప్రాంగణాన్ని మరింత విస్తరించాలని గ్రామస్తులు కోరారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, ఐక్యత పెంపొందిస్తుందని గ్రామానికి చెందిన యువత క్రీడలలో రాణించి వెల్టూరు గ్రామాన్నిజాతీయ స్థాయిలోగుర్తింపు వచ్చేలా కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు. సమ్మర్ కబడ్డీశిక్షణ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్‌ను గ్రామ సర్పంచుచింతోజు వెంకటేష్, మాజీ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, యువకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృత్యువాత పడ్డ గుర్తు తెలియని వ్యక్తి

**అచ్చంపేట, మే, 30ప్రభాతవార్త:** అచ్చంపేట పట్టణంలో శ్యామ్స్ ఫంక్షన్ హాల్ సమీపంలోశనివారం మధ్యాహ్నం ఒక వ్యక్తి అనుమానాస్పదంగా పడి ఉన్న విషయాన్ని ఎస్సై సద్దాం హుస్సేన్ కు సమాచారం ఇవ్వగా వెంటనే అక్కడికి వెళ్లి అతని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే అతను మరణించినట్లు నిర్ధారణ చేశారు. ఎవరికైనాఇతని వివరాలు తెలిస్తే ఈక్రింది నెంబర్ లకు 8712657732, 8712657731సమాచారం ఇవ్వాలని ఎస్సై సద్దాం హుస్సేన్ తెలిపారు.

## చిన్నారులకు యూనిఫామ్‌ల పంపిణీ

**మద్దూరు, మే30 ప్రభాతవార్త:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మద్దూరు మున్సిపాలిటీ పరిధిలో శనివారం అమ్మ మాట-అంగన్‌వాడి బాట" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా అంగన్‌వాడి కేంద్రాల ప్రాధాన్యత, చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, ప్రాథమిక విద్యపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 1వ వార్డు కౌన్సిలర్ సంగీత చాపన్ చెరువు తాండ అంగన్‌వాడి కేంద్రంలో, 2వ వార్డు కౌన్సిలర్ ఎంఎన్, నరసింహులు ఆయా వార్డుల అంగన్‌వాడి కేంద్రాల్లో చిన్నారులకు యూనిఫామ్ బట్టలను పంపిణీ చేశారు. పిల్లలను ప్రతిరోజూ అంగన్‌వాడి కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. అంగన్‌వాడి టీచర్లు వాణిశ్రీ, సిద్ధమ్మ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అంగన్‌వాడి సేవలు, బాలల విద్యా-పోషణ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పరశురాం, అశోక్, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు యూనిఫాంలు అందజేస్తున్న దృశ్యం

## సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**నారాయణపేట, మే 30 ప్రభాతవార్త :** నారాయణపేట గోశాలలో భారతీయ గ్రామీణ డాక్ కర్మచారి సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు వినయ్ సుధర్ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయం, గోసంరక్షణపై రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబను శాలువాతో ఘనంగా సన్మానించారు. గత పది సంవత్సరాలుగా గోశాల ద్వారా అనేక మంది రైతులకు గిరి ఆవులను ఉచితంగా అందజేసి సేంద్రియ, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న వెంకోబ సేవలను వినయ్ సుధర్ ప్రశంసించారు. గోమాత, భూమాత పరిరక్షణ వ్యవసాయాభివృద్ధికి అత్యంత అవసరమని, గోవుల ద్వారా లభించే పాలు, పెరుగు, వెన్న, గోమూత్రం, గోమయం వ్యవసాయానికి, ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. రసాయనిక ఎరువుల అధిక వినియోగం వల్ల భూసారం దెబ్బతింటోందని, రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లి భూసారాన్ని పెంచుకుంటూ ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పండించాలని పిలుపునిచ్చారు. రైతులకు గోవులు, కోళ్లను ఉచితంగా అందించి వ్యవసాయాభివృద్ధికి తోడ్పడుతున్న వెంకోబకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో అప్పిరెడ్డిపల్లె శీలంమాణిక్ రెడ్డి మాట్లాడుతూ కూరగాయల సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నందున ప్రభుత్వం ఉచితంగా కూరగాయల నార్లు అందించాలని కోరారు. ముందస్తుగా సాగు చేపడితే రైతులకు గిట్టుబాటు ధర లభించి నష్టాలు తగ్గుతాయని అన్నారు. ఓబులాపురం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా అధికారుల సూచన మేరకు ఉద్యానశాఖ ద్వారా కూరగాయల విత్తనాలు, నార్లు రైతులకు అందుబాటులో ఉంచాలని ఉట్కూర్, నారాయణపేట, దామరగిద్ద ప్రాంతాల రైతుల తరఫున విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పగిడిమారి నరసింహారెడ్డి, కురువ మల్లేష్, ధన్వాడ బాలస్వామి, మాల్యాతాండ మల్లేష్, నందిని రాములు, ముందెకోడు సురేష్, కావలి కృష్ణయ్య, శీలం మాణిక్ రెడ్డి, గవినోల సంజీవ్ రెడ్డి, పెద్దింటి నాగప్ప, మంగలి నరసప్ప, పటేల్ రంగారెడ్డి తదితర రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు

**● ఆత్మకూర్ తహసీల్దార్ జేకే మోహన్**



శ్రీ లక్ష్మీ రైస్ మిల్లును తనిఖీ నిర్వహిస్తున్న తహసీల్దార్ జేకే మోహన్

**ఆత్మకూర్ మే30, ప్రభాతవార్త;** వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులు తెచ్చిన వరి ధాన్యాన్ని తక్షణమే రైస్ మిల్లు యజమానులు దించుకోవాలని లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూర్ తాసిల్దార్ జేకే మోహన్ రైస్ మిల్లు యజమానులను హెచ్చరించారు. శనివారం రోజు కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని అన్ని రైస్ మిల్లులను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించి రైతులచే నేరుగా మాట్లాడుతూ ఇబ్బందులను అడిగి తెలుసు కున్నారు. కొనుగోలు కేంద్రాల నుండి వచ్చినటువంటి వరి ధాన్యా న్ని వాహనాల నుండి రైస్ మిల్లు యాజమానులు తక్షణమే దించు కోవాలని ఈ విషయంపై రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని అంతేకాకుండా ఎలాంటి తరుగు లేకుండా రైతులకు పట్టీలు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. పట్టణంలోని ప్రధానంగా శ్రీ లక్ష్మీ రైస్ మిల్లులో ప్రతి బస్తాకు రెండు కేజీల తరఫున ధాన్యాన్ని కట్ చేస్తున్నారంటూ తాసిల్దార్ జెకే మోహన్ కు గుంటుపల్లి రైతులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై తాసిల్దార్ స్పందిస్తూ వరి ధాన్యం బస్తాలకు ఎలాంటి తరుగు లేకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేయడమే కాకుండా రైస్ మిల్లు యాజమానులు రైతులకు తరుగు లేకుండానే పట్టీలు అందించాలని సూచించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు విక్రయించిన తర్వాత ప్రస్తుత వాతావరణ పరిస్థితులు నేపథ్యంలో ధాన్యం తడవకుండా తార్పాలిన్లు కప్పుతూ వరి ధాన్యం తడవకుండా రైతులు కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. తాసిల్దారు వెంబడి రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీశైలం, జిపిఓ రాము తదితరులు ఉన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు

**● మండల వ్యవసాయ అధికారి గుండూరు అనిల్**



ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ షాపులను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి

**లింగాల, మే30, ప్రభాతవార్త:** ఫర్టిలైజర్స్, పెస్ట్ సైడ్ షాపుయజమానులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని మండల వ్యవసాయ అధికారి గుండూరు అనిల్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రమైన లింగాల లో ఫర్టిలైజర్, పెస్టిసైడ్ దుకాణాలను తహసీల్దార్ వెంకటేష్, ఎస్సై చంద్రకాంత్ లతో కలిసి ఏవో గుండూరు అనిల్ తనిఖీ నిర్వహించి, రికార్డులను, దుకాణాల లైసెన్సులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో గుండూరు అనిల్ మాట్లాడుతూ సీడ్స్ అండ్ ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ డీలర్లు తమ షాపులలో రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. కొన్న రైతులకు తప్పనిసరిగా రశీద్ ఇవ్వాలని, స్టాక్ రిజిస్టర్లలో స్టాక్ వివరాలను ప్రతిరోజు నమోదు చేయాలన్నారు. అందరికీ కనిపించే విధంగా బ్లాక్ బోర్డు పైన విత్తనాల రేట్లు స్టాక్ వివరాలను ప్రతిరోజు నమోదు చేయాలని అన్నారు. రైతులకు విత్తనాలు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని ఆదేశించారు. ఎక్స్పైర్ అయిన విత్తనాలు, నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. డీలర్లు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు విక్రయించినట్లు సమాచారం ఉంటే వెంటనే వ్యవసాయ, పోలీస్, శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## 5 సంవత్సరంలోపు పిల్లలను అంగన్వాడిలో చేర్పించాలి

**● సిడిపిఓ దమయంతి**



పెద్దాపూర్‌లో చిన్నారులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

**ఉప్పునుంతల, మే 30 ప్రభాతవార్త:** 5 లోపు చిన్నారులను అంగన్‌వాడి కేంద్రాలలో చేర్పించాలని ఐసిడిఎస్ బల్మూర్ ప్రాజెక్టు సిడిపిఓ ధమయంతి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో అమ్మ మాట అంగన్‌వాడి బాట అనే నినాదంతో పాటు ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడి కేంద్రం ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ శిశువు నుంచి ఐదు సంవత్సరాల లోపు చిన్నారులను అంగన్‌వాడి కేంద్రాలలో చేర్పించి పోషక పదార్థాలు, పిల్లల ఎదుగుదల కోసం కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు. అదే విధంగా మండలంలోని వెల్టూరు, దేవదారి కుంట తండా లలో అంగన్వాడి కేంద్రాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఆయా అంగన్‌వాడి కేంద్రాల్లో చిన్నారులకు రెండు జతల డ్రస్సులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ దమయంతి, ఎంపిడిఓ వరుణ్ తేజ, సూపర్‌వైజర్‌లు బిపాసా, పావని, సర్పంచులు వంగ సాయిబాబు గౌడ్, చింతోజు వెంకటేష్, మంగమ్మ రతన్ సింగ్, ఉప సర్పంచులు నరేష్ యాదవ్, ఉప్పరి మల్లయ్య, వార్డు సభ్యులు, ఆయా గ్రామాల అంగన్ వాడీ కార్యకర్తలు కొత్త శ్రీలత, నిరంజనమ్మ వేదవతి, సోనమ్మ, ఆశా కార్యకర్తలు, చిన్నారులు పాల్గొన్నారు.





మామిళ్ళపల్లి ఆలయం ముఖ ద్వారం వద్ద అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

## మామిళ్ళపల్లి ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు

**ఉప్పునుంతల, మే 30 ప్రభాతవార్త :** మండలంలోని మామిళ్ళపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వేముల నరసింహారావు సాదరంగా ఆహ్వానించారు. మేళా తాళాలతో పూర్ణకుంభంతో కలెక్టర్ కు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో వేద పండితుల చే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పురాతన ఆలయ అభి వృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని, ఆలయ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి కోసం కృషి చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ ప్రత్యేకంగా ఆలయ కమిటీ చైర్మన్ తో పాటు అన్ని శాఖల అధికారులతో ప్రత్యేకంగా అధికారుల ను అభినందించారు. అనంతరం గ్రామంలో నడుస్తున్న ఉపాధి పనుల వద్దకు కలెక్టర్ వెళ్లడంతో కూలీలు, మహిళా సంఘం ప్రతినిధులు కలెక్టర్ కు ఘన స్వాగతం పలికారు. తదుపరి మొక్కను అందించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తో పాటు తహసీల్దార్ అద్దంకి సునీత, ఉప తహసీల్దార్ రమేష్, ఆలయ కమిటీ చైర్మన్ వేముల నరసింహారావు, ఎంపిడిఓ వరుణ్ తేజ, మండల వ్యవసాయ అధికారి కొర్ర రమేష్, సర్పంచ్ మోహన్ గౌడ్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ

**వెల్దండ, మే 30 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలో ఏపీఎం జయమాలిని ఆధ్వర్యంలో మండల మహిళా సమైక్య 99 రోజుల ప్రజా పాలన ప్రగతి నివేధికలో భాగంగా మహిళా సమైక్య సభ్యురాలు ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న రుణాలు ప్రోత్సాహకాలు ఎలా సద్వినియం చేసుకో వాలనే అంశంపై ర్యాలీలో వివరించారు. కార్యక్రమంలో సీసీలు మహిళా సంఘ సభ్యురాలు ఉన్నారు.

## చెరువు నీటి వృథాను అరికట్టాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న బిఆర్ఎస్ నాయకులు


**నారాయణపేట, మే 30 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా ఊట్కూరు గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్ద చెరువు సమృద్ధిగా నీటితో నిండిందని, అయితే ప్రస్తుతం మూడు తూముల ద్వారా నీటినిదిగువ ప్రాంతాలకు వదులుతున్నందున విలువైన నీరు వృథా అవు తోందని బీఆర్ఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన నాయకులు మాట్లాడుతూ భవిష్యత్తులో గ్రామ ప్రజల తాగునీటి అవసరాలు, రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని చెరువులో నీటిని నిల్వ ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం నీరు వృథాగా పోవడం వల్ల రాబోయే రోజుల్లో పంటలకు నీటి కొరత ఏర్పడి రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. చెరువులో నీరు నిల్వ ఉంటే రైతులకు సాగునీరు అందడంతో పాటు గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య కూడా తలెత్తదని పేర్కొన్నారు. అందువల్ల వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి మూడు తూములను మూయించి వృథాగా పోతున్న నీటిని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కోరం శివరాజ్, వెంకటేష్ గౌడ్, ఇబదూర్ రెహ్మాన్, సి.ఆనంద్ రెడ్డి, తరుణ్ రెడ్డి, సమీ కాలిక్ తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞాన ప్రతీక అవార్డు మహోత్సవానికి జిల్లా కలెక్టర్‌కు ఆహ్వానం



**ధన్వాడ, మే 30 ప్రభాతవార్త :** ధన్వాడ మండలంలోని పాతపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 2వ తేదీన నిర్వహించనున్న "జ్ఞాన ప్రతీక అవార్డు మహోత్సవం" కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రియాంకను ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామ విద్యా పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కుజురత్ అలీ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఇతర ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాన ప్రతీక అవార్డు" ప్రదానం చేసి సత్కరించ నున్నట్లు తెలిపారు. గ్రామంలో విద్యా ప్రోత్సాహం కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరు కావాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ ఆహ్వాన కార్యక్రమంలో గ్రామ విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు జె. శివ, వై. కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ప్రేరణ పెంపొందించడమే ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

## అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం



చిన్నారులకు యూనిఫాం అందజేస్తున్న దృశ్యం

**దామరగిద్ద, మే 30 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "అమ్మ మాట అంగన్‌వాడీ బాట" కార్యక్రమంలో భాగంగా దామరగిద్ద మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కనికి రెడ్డి, ఉప సర్పంచ్ సత్తి నారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కే. బాల్‌రెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రూప, వార్డు సభ్యుడు బాబు, కాంగ్రెస్ నాయకులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులుపాల్గొన్నారు. ఈసందర్భంగా సర్పంచ్ కనికి రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించి పౌష్టికాహారం, పూర్వ ప్రాథమిక విద్యను అందిపుచ్చుకునేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో చిన్నారులకు యూనిఫాం లను పంపిణీ చేయగా, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

## కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**వెల్దండ, మే 30 ప్రభాతవార్త:** కల్లు గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గౌడ సంఘం మండలాధ్యక్షులు మట్ట వెంకటయ్య గౌడ్ కల్లుగీత కార్మిక సహకార సంఘం అధ్యక్షులు మట్టమదన్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయత్రీదేవి, సీఐ వెంకట్‌రెడ్డిని కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్లుగీత కార్మికులకు పొలంలో మొక్కలు నాటే విషయంపై చర్చించి పెన్షన్లు అందించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు విష్ణు గౌడ్, కార్యదర్శి కృష్ణయ్య గౌడ్, డైరెక్టర్లు మట్ట శంకరయ్యగౌడ్, మట్ట నిరంజన్‌గౌడ్, తదితరులు ఉన్నారు.



## మహిళా సాధికారతతో వివక్ష లేని సమాజ నిర్మాణం

◆ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

**గద్వాల మే30, ప్రభాతవార్త:** ప్రస్తుతం మహిళలు అనేక రంగాల్లో రాణిస్తున్నారని, మహిళా సాధికారతతో వివక్ష లేని సమాజ నిర్మాణం జరుగుతుందని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్లో భాగంగా నిర్వహిస్తున్న మహిళా సంక్షేమ వారోత్సవాల్లో శనివారం ఐడిఓసి సమావేశపు మందిరంలో జిల్లా గ్రామీణ అభి వృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని స్నేహ సంఘాల సభ్యులతో మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ యూనిసెఫ్ సహకారంతో బాలికల సర్వతోముఖాభివృద్ధికి జిల్లాలోని అన్ని గ్రామాల్లో స్నేహ సంఘాలను ఎన్నుకోవడం జరిగిందన్నారు. బాలికలు ప్రజాస్వామ్య వ్యవస్థ, నాయకత్వ నైపుణ్యాలు, ప్రజా సమస్యల ప్రతిపాదన, ప్రశ్నించడం, తదితర విషయాలపై అవగాహన పెంపొందించుకునేందుకు మాక్ పార్లమెంట్ దోహదపడుతుందన్నారు. స్నేహ సంఘాల ద్వారా అమ్మాయిలు తమ గ్రామాల్లోని బాల్య వివాహాలు, నిరక్షరాస్యత వంటి సామాజిక సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా బాలికలు మాక్ పార్లమెంట్ ద్వారా జిల్లాలోని వివిధ సామాజిక సమస్యలను ప్రస్తావించారు. పలు పాఠశాలల్లో మరుగుదొడ్లు లేకపోవడం, ఉన్నచోట పరిశుభ్రంగా లేకపోవడం, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల ఆవశ్యకత, రవాణా సౌకర్యాల కొరత, తదితర సమస్యలను బాలికలు తెలియజేయగా సంబంధిత అధికారులు వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం బాలికలు ఐడిఓసిలో ఉన్న పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలను సందర్శించి అక్కడి పనితీరును గురించి సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ రాష్ట్ర సమన్వయకర్త మురళి, డిఆర్డిఓ ముషాహిదా బేగం, ఏపీడి శ్రీనివాస్, డిడబ్ల్యుఓ సునంద, డిఇఓ విజయలక్ష్మి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న

## సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

◆ అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**అచ్చంపేట, మే,30 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ ప్రతిష్టను మరింత పెంచే విధంగా ప్రతి కార్యకర్త కంకణ బద్ధులు కావాలని ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ అన్నారు. శనివారం అంబేద్కర్ ప్రజా భవన్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం, రానున్న కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. పార్టీ శ్రేణులు ప్రజలకు మరింత చేరువ కావాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కార్యకర్తలకు సూచించారు. పార్టీ అభివృద్ధికికార్యకర్తలే వెన్నెముక అని పేర్కొంటూ, వారి సూచనలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీనియర్ నేతలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంది...**

మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ అన్నారు. శనివారం రెండవ వార్డు సాయి నగర్ కాలనీలో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో చీరాల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మురళి, మాజీ వార్డు కౌన్సిలర్ సుంకరి నిర్మల బాలరాజు, కాంగ్రెస్ నేతలు మదాసు రాజు, సుంకరి లింగం, సుంకరి మహేష్, కాలని మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



కాలనీలో సమస్యలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

**కాలనీ సమస్యలపై ఎమ్మెల్యే ఆరా...**

ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా 9వ వార్డు మధురానగర్ కాలనీలో వర్షపు నీరు నిల్వ ఉండటంతో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం కాలనీ వాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నీటి నిల్వవల్ల ఏర్పడుతున్న అసౌకర్యాలు, డ్రైనేజీ సమస్యలపై అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కాలనీలో నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కాలని వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్‌మురళి, ఏఈ రాజు నాయక్, గోపాల్‌రెడ్డి, అంతటి మల్లేష్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- ◆ ప్రైవేటు విద్యా సంస్థలలో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఇవ్వాలి
- ◆ అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి
- ◆ ఆర్టీఏ అధికారులు పాఠశాలల బస్సులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- ◆ బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డా. రాచాల యుగంధర్ గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న రాచాల

**వనపర్తి, మే 30, ప్రభాతవార్త:** అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్న ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలపై విద్యార్థుల తల్లిదండ్రుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలోనే పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం కాబోతున్న తరుణంలో విద్యాశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రతి ప్రైవేటు పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం ప్రకారం 25% సీట్లను పేద విద్యార్థు లకు ఉచితంగా ఇవ్వాలని అన్నారు. జిల్లాలో కొందరు చదువుల పేరుతో వ్యాపారం చేస్తున్నారని, పాఠశాలల్లోనే పుస్తకాలు, యూనిఫామ్, టై, బెల్టు, షూ అమ్ముతూ అక్రమాలకు పాల్పడుతున్నారని, అలాంటి పాఠశాలలపై బీసీ పొలిటికల్ జేఏసీ ప్రత్యేక నిఘా పెడుతుందని హెచ్చరించారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతున్న సందర్భాన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్టీఏ అధికారులు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల బస్సుల ఫిట్నెస్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గతంలో అనేకసార్లు ప్రమా దాలు చోటుచేసుకుని విద్యార్థులు గాయపడి, మృతి చెందిన సందర్భాలను ఆయన గుర్తు చేశారు. నేడు ప్రభుత్వ విద్య గణనీయంగా మెరుగుపడిందని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. బీఈడీ, పీజీ పూర్తి చేసి ఎంతో అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో విద్యను బోధిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు కార్పొరేటు మోజులో పడి లక్షల రూపాయలను వృధా చేసుకోవద్దని హితవు పలికారు. నాణ్యమైన విద్య అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలకే తమ పిల్లలను పంపించేలా కృషి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రైవేటు పాఠశాలలు, కార్పొరేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయకపోతే వాటిని సీజ్ చేపించే వరకు బీసీ పొలిటికల్ జేఏసీ విశ్రమించదని హెచ్చరించారు. నామినల్ ఫీజులు తీసుకుంటూ, ఉత్తమ విద్య అందిస్తున్న పాఠశాలలకు మాత్రం తమ సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, కృష్ణ ప్రసాద్, అస్కని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాలకేంద్రాలు సంప్రదాయ కళలకు నిలయాలు

◆ టీఎన్‌జీవోస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయభాను



చిన్నారులకు నోట్‌బుక్కులు అందజేసిన దృశ్యం

**నారాయణ పేట, మే30 ప్రభాతవార్త:** నారాయణపేట బాల కేంద్రాలు సంప్రదాయ కళలను పరిరక్షించే కళానిలయాలుగా నిలుస్తున్నాయని, చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని టీఎన్‌జీవోస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయభాను అన్నారు. టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో బాలకేంద్రంలో వివిధ కళాంశాల్లో శిక్షణ పొందుతున్న 120 మంది చిన్నారులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు వేసవి సెలవులను వృథా చేయకుండా సంస్కృతి, సంప్రదాయ కళలను నేర్చుకునేందుకు ప్రభుత్వం బాలకేంద్ర కళానిలయాలను ఏర్పాటు చేసిందన్నారు. ఇంతమంది చిన్నారులు తమకు ఇష్టమైన కళలను నేర్చుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. గతంలో బాల కేంద్రాల్లో శిక్షణ పొందిన అనేక మంది విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ చాటి జిల్లాకు గుర్తింపు తీసుకురావడం గర్వకారణమన్నారు. ఇష్టం, లక్ష్యం, పట్టుదలతో ఏ కళనైనా నేర్చుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని చిన్నారులకు సూచించారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాలకేంద్ర సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి, సంగ నర్సింహులు, వసంత్ కుమార్, జ్ఞానమృత పాల్గొన్నారు.

## హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేద్దాం



హిందు సమ్మేళన సమావేశానికి హాజరు కావాలని ఆహ్వానిస్తున్న దృశ్యం

**వెల్దండ, మే 30 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించే హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేద్దామని హిందూ సమ్మేళన నిర్వహణ సమితి పెద్దాపూర్ అధ్యక్షులు సుంకిరెడ్డి వరప్రసాద్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే హిందూ సమ్మేళన ఆహ్వాన పత్రికను శనివారం శ్రీవిద్య మహాత్రిపుర సుందరీ దేవి పీఠము శివ కృష్ణ స్వామి వారికి వరప్రసాద్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యక్రమానికి ప్రాంత ప్రచార ప్రముఖ్ ఆర్ఎస్ఎస్ శ్రీ కట్ట రాజగోపాల్ చేస్తున్నారని, హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హరి ప్రసాద్, అంజయ్య చారి, శోభన్ బాబు, రాఘవేందర్, యాదయ్య, సత్యనారాయణ చారి, మల్లయ్యతో పాటు తదితరులు ఉన్నారు.

## కేసిరెడ్డికి గౌరవ డాక్టరేట్



**భూత్పూర్, మే 30, ప్రభాతవార్త:** భూత్పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కి గౌరవ డాక్టరేట్ లభించింది. యునైటెడ్ తియోలాజికల్ యూనివర్సిటీ వారు ఈ గౌరవ డాక్టరేట్ బిరుదు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి ప్రదానం చేశారు. తమ మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి గౌరవ డాక్టరేట్ సత్కారం పొందినందును మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కేసిరెడ్డిని సన్మానించిన వారిలోహస్నాపూర్ సర్పంచి తాళ్లగడ్డ సంజీవరెడ్డి, చేగుంట సర్పంచి ఖిల్లా మల్లయ్య, బట్టుపల్లి సర్పంచి లక్ష్మమ్మ రఘుపతిరెడ్డి, పోతుల మడుగు సర్పంచి ఆనంద్‌రెడ్డి, మాజీ సర్పంచి హరియానాయక్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డితో నాయకులు కిట్టురెడ్డి, మధుసూధన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులున్నారు.

## జూన్ 14న చలో మహబూబ్‌నగర్ పోస్టర్ విడుదల

**భూత్పూర్, మే30, ప్రభాతవార్త:** కులాల వారీగా వాటా కోసం వచ్చే నెల 14న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించే భారీ బహిరంగసభకు జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన అన్ని వర్గాల ప్రజలు, యువకులు, నాయకులు, సభ్యులు, సంఘాల కార్యకర్తలు అత్యధికంగా హాజరై బహిరంగసభను జయప్రదం చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ(జేఏసీ)రాష్ట్ర కార్యదర్శి గుడిసె బాలయ్య ముదిరాజ్ పిలుపునిచ్చారు. బహిరంగసభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను భూత్పూర్‌చౌరస్తాలో శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా గుడిసె బాలయ్య మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో బీసీ, ఎస్సీ, ఎస్టీవర్గాలకు చెందిన జనాభా 90 శాతం ఉండగా, అధికారం మాత్రం ఏ కొందరి చేతుల్లో ఉండి అణగారిన వర్గాలను అణగదొక్కుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. కులాల వారీగా, జనాభా ప్రాతిపదికన రాజకీయ వాటా కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుడిసె పేర్కొన్నారు. పోస్టర్ విడుదల కార్యక్రమంలో వివిధ కుల సంఘాలు, వర్గాలకు చెందిన సభ్యులు వెంకటయ్య, అడివన్న, అంగం నారాయణ ముదిరాజ్, దుబాయ్ సాయిలు, షేక్ ఇస్రాన్, గడ్డం లక్ష్మయ్య, గోప్లాపూర్ వెంకటయ్య, గడ్డం బుచ్చన్న, బ్యాగరి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## అమ్మకు అక్షరమాల కార్యక్రమం



**బాలానగర్, మే30 ప్రభాతవార్త:** బాలానగర్ మండలంలోని నందారం గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం వయోజన విద్య, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో అమ్మకు అక్షరమాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐకేపీ అధికారి తిరుపతయ్య మాట్లాడుతూ ప్రతి మహిళ విద్యను అభ్యసించాలని, చదువుకున్న మహిళ కుటుంబం, సమాజం అభివృద్ధికి దోహదపడటమే కాకుండా ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని అన్నారు. మహిళల్లో అక్షరాస్యత పెంపొందించడం, విద్యపట్ల అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో

## ఉపాధి కూలీలకు అవగాహన



**మక్తల్ టౌన్, మే 30 ప్రభాతవార్త:** జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో జీ నారాయణ పిఎల్‌వి ఆధ్వర్యంలో మక్తల్ మండలం లోని చిట్యాల గ్రామంలో ఉపాధి హామీకూలీలకు బాల్యంలో వివాహం చేస్తే అమ్మాయిలు ఎదుర్కొనే సమస్యల గురించి అవగాహన కల్పించారు. అమ్మాయికి వచ్చే శారీరక మానసిక సమాజంలోపొందే అవమానం గురించి అదేవిదంగా అమ్మాయిలకు 18సం లోపు ఉన్న వారితో అసభ్యంగా ప్రవర్తించిన (కూటింబికులైన)ఫొటోలు వీడియోలు తీసి ఏడిపించిన వారికీ ఫోక్సో చట్టం ఆధారంగా కఠినమైన శిక్షలు ఉంటాయనీ కూలీలకు అవగాహన కల్పించారు. ఘటన ఆధారంగా 3 నుండి 20 సం "జైలు శిక్ష లేదా జీవిత ఖైదు కూడా పడే అవకాశం ఉంటుందని అన్నారు. బాల్యవివాహాలు చేసిన, బాలికలపై అఘాయిత్యాలు జరిగినట్లు తెలిసిన వెంటనే 1098,100,112,కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలనీ పిఎల్‌వీ నారాయణ తెలియ జేశారు. వారు కోరుకుంటే మీసమాచారం గోప్యంగా ఉంచుతారని అన్నారు. అందుకుమీరంతా చదవాలి, చట్టం గురించి తెలుసుకోవాలని అన్నారు. కార్యక్రమములో ఉప సర్పంచ్ దత్తు, కారోబార్, అశోక్, ఫీల్డ్ అసిస్టెంట్ మహినొద్దీన్ ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## ప్రతి మహిళ అక్షరాస్యులుగా మారాలి

**చిన్న చింతకుంట, మే30 ప్రభాతవార్త:** ప్రతి మహిళ అక్షరాస్యులుగా మారాలని గ్రామ సర్పంచ్ మానస దశరథ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా వారోత్సవాల్లో భాగంగా అమ్మకు అక్షరమాల ర్యాలీని నిర్వహించారు. గ్రామపంచాయతీ నుంచి సంత బజార్ వరకు ర్యాలీ కొనసాగింది. కుటుంబంలో మహిళలు చదువుకుంటే ఆ కుటుంబం ఉన్నత స్థితికి చేరుకుంటుందని ఆమె తెలిపారు. మహిళా సంఘ సభ్యులతో పాటు ప్రతి మహిళ చదువుకోవాలని ఆమె సూచించారు. ప్రభుత్వాలు మహిళలను అక్షరాస్యులుగా మార్చేందుకు ఉల్లాస్ కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. ఆడపిల్లలు అక్షరాస్యులుగా మారినప్పుడే సమాజంలో మార్పు సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు కురుమన్న, రాజు, ఖత్తాల్ అహ్మద్, అకౌంటెంట్ ఫారూఖ్, విబికే లు కృష్ణవేణి, అనిత, శాంత, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు పట్నం మహేందర్ రెడ్డి

**వనపర్తి, మే 30, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలో జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా తెలంగాణ శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి హాజరవుతున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వనపర్తి జిల్లా ఐడిఓసి ఆవరణలో జూన్ 2వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. వేడుకల్లో భాగంగా ముఖ్య అతిథి పట్నం మహేందర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీస్ గౌరవ వందనం స్వీకరించి, ప్రగతి నివేదికను తన ప్రసంగం ద్వారా ప్రజలకు తెలియజేయనున్నారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ఆయన వివరించనున్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**దేవరకద్ర, మే 30 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం జీనుగురాల గ్రామానికి చెందిన బోయ అంజమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జీనుగురాల సర్పంచ్ నాగమ్మ సాయిలు బాధిత కుటుంబాన్ని పరామర్శించి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు రూ. 5000లు ఆర్థిక సహాయం బాధిత కుటుంబానికి అందజేశారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరహరి, మాజీ ఎంపీటీసీ యాదగిరిరెడ్డి, వార్డ్ సభ్యులు నాగన్న, రామకృష్ణ, హరిజన్ లక్ష్మణ్, బోయ కురుమూర్తి, బోయరవి, బోయ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో**

## మండల అధ్యక్షునికి సన్మానం

**శ్రీరంగాపూర్, మే 30 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన విష్ణు ముదిరాజును శనివారం శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీ రంగనాయక స్వామి వారి ఆలయం దగ్గర వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ రెడ్డి చర్ల శ్రీహరి రాజు విష్ణు ముదిరాజును ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామ్ చంద్రయ్య యాదవ్, బహుజన రమేష్, రామరాజు, ఆంజనేయులు ముదిరాజ్, నగరాల ఉపసర్పంచ్ కురుమయ్య, తాటిపాముల ఉప సర్పంచ్ గంధం కురుమయ్య, రంజిత్, నాగేష్, లక్ష్మణ్, రవి, సంపత్, విష్ణు, స్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని బాలుని మృతి

**పెబ్బేరు, మే 30 ప్రభాతవార్త :** కారు ఢీకొన్న సంఘటనలో మంజునాథ్ ఒకటిన్నర సంవత్స రాల బాలుడు మృతి చెందిన సంఘటన శని వారం చోటు చేసుకుంది. పోలీసులు బాలుని తండ్రిఅశోక్ తెలిపిన వివరాల ప్రకారం పాన్‌గల్ మండలం కేతపల్లి గ్రామానికి చెందిన అశోక్ భార్య సంధ్య కుమారులు మోక్షిత్, మంజునాథ్‌తో కలిసి పెబ్బేరుకు పని నిమిత్తం వచ్చారు. మున్సిపాలిటీ క్రీడా మైదానంలో కూర్చొని ఉండగా అదే సమయంలో హిమబిందు అనే యువతి తన కారును మున్సిపాలిటీ మైదానంలో నేర్చుకుంటుంది. అదుపుతప్పి ఒక్కసారిగా బాలుని పైకి దూసుకెళ్లడంతో తలకు తీవ్ర గాయాల య్యాయి. ఆసుపత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై వెంకటేష్ గౌడ్ తెలిపారు. తండ్రి అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. బాలుడి మృతుదేహాన్ని వనపర్తి ఏరియా హాస్పిటల్ కి తరలించినట్లు వారు చెప్పారు.

## డ్రైనేజీ పనులకు భూమి పూజ

**రాజాపూర్, మే 30 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కుచ్చరకల్ గ్రామంలో శివాలయం నుండి శ్రీహరి గౌడ్ ఇంటి వరకు నూతనంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు భూమి పూజ కార్యక్రమం సర్పంచ్ గంగాపురి వెంకటయ్యగౌడ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బ్యాగారి తిరుపతమ్మ వెంకటయ్య, మాజీ సర్పంచ్ గంగాపురి కృష్ణయ్య గౌడ్, మాజీ ఎఎంసి డైరెక్టర్ బోయ శ్రీశైలం, వార్డ్ మెంబర్లు జక్క శ్రీశైలం, ఒగ్గు అనిల్ గౌడ్, మంగలి రాఘవేందర్,మిద్దె యాదయ్య, బిఆర్ఎస్ పార్టీనాయకులు వస్పుల కృష్ణయ్య, అన్వూర్ కరుణాకర్ గౌడ్, ఎర్రోళ్ల నరసయ్య,ఒగ్గు అశోక్ గౌడ్, శ్రీహరి గౌడ్, రాజేష్ గౌడ్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

జూన్ 4,5 తేదీల్లోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని కలెక్టర్లకు సూచించారు. కొనుగోలు, రవాణా, నిల్వ, రైతులకు చెల్లింపుల ప్రక్రియను సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఇసుక రవాణాకు వినియోగిస్తున్న లారీలను వారం రోజులు తాత్కాలికంగా ధాన్యం రవాణాకు మళ్లించాలని సూచించారు.అవసరమైతే లారీలు, డీసీఎంలను రిక్విజిషన్ చేసి ధాన్యం తరలింపునకు వినియోగించాలని ఎస్పీలు, ఆర్టీఏ అధికారులకు సూచించారు.హమాలీల కొరత కొన్ని చోట్ల ఉందని,పశ్చిమ బెంగాల్ ,బీహార్ రాష్ట్రం నుంచి హమాలీలు పని చేస్తారని,హమాలీలు అదనంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈయాసంగి లో 66 లక్షల ఎకరాల్లో వరి ధాన్యం సాగు చేయగా 141 లక్షల మెట్రిక్ టన్నులవరి ధాన్యం పండించారు.ఇందులో రాష్ట్రం 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలనిలక్ష్యం పెట్టుకుందని అన్నారు.ఇందుకు మించి కొనుగోలు కేంద్రాలకు అదనంగా వచ్చిన ప్రతి గింజను కొనుగోలు కు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎం.ఎస్.పి విధానం ప్రకటించి 51 లక్షల మెట్రిక్ టన్నుకు కేంద్రం ప్రభుత్వం కొనుగోలు చేయగా రాష్ట్ర ప్రభుత్వం 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు తగ్గకుండా ఎంత ధాన్యం వచ్చినా కొనుగోలు చేస్తుందని తెలిపారు. కేంద్రం ఎం.ఎస్.పి విధానం కురాష్ట్ర ప్రభుత్వం 16479 కోట్ల రూ.లు అదనంగా ఖర్చు పెట్టి ధాన్యం కొనుగోలు చేసిందని తెలిపారు. రాష్ట్రంలో 8575 కొనుగోలు కేంద్రాలు ,13 వేల వాహనాలు,రెండు లక్షల మంది సిబ్బంది,2008 రైస్ మిల్లులు భాగస్వామ్యులు అయ్యారని,20 కోట్ల 80 లక్షల గన్ని సంచులు సరఫరా చేశామని తెలిపారు. ఈ రోజు వరకు 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు..ఈ యాసంగి కి 111500 కోట్ల రూ.లు సుమారు 8 లక్షల 75 వేల మంది రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. 8575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా 2255 కొనుగోలు కేంద్రాలు లో కొనుగోలు పూర్తి చేసినట్టు తెలిపారు. దేశంలో తెలంగాణ వరి ఎక్కువ కొనుగోలు చేస్తుందని,కేంద్రం ప్రభుత్వం రాష్ట్రంలో పండిన వరి ధాన్యం లో 38 శాతం మాత్రమే కొనుగోలు చేస్తుందని అన్నారు.కేంద్రం కొనకున్న 16479 కోట్ల రూ.లు చెల్లించి రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేస్తుందని అన్నారు.కొనుగోలు చేసిన వరి ధాన్యంకు గతంలో నెలల తరబడి చెల్లింపు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం48 నుంచి 72 గంటల్లోనే వేగంగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తుందన్నారు 2024,25 ఖరీఫ్ , రబీ కలిపి 36,148 కోట్ల రూ.లు,2025,26 ఖరీఫ్,రబీ కి కలిపి 39,359 కోట్ల రూ.లు రైతుల ఖాతాలో జమ చేసినట్లు తెలిపారుఅతి పెద్ద రాష్ట్రం 23 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా,తమిళ నాడు 11 లక్షల మెట్రిక్ టన్నుల మాత్రమే కొనుగోలు చేయగాజిల్లాల వారీగా గోదాములలో నిల్వ స్థలాల కేటాయింపుపై పరస్పర సమన్వయం చేసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్రను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు వెంటనే తరలించాలని, రైతులకు ఇబ్బంది కలిగించేలా తాలు, తరుగు పేరుతో కోతలు విధించే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఎక్సైజ్,పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు మాట్లాడుతూ నాగర్ కర్నూల్ లో ధాన్యం సేకరణ పై ప్రజా ప్రతినిధులు,అన్ని శాఖల అధికారులతో సమీక్ష చేసినట్లు, గోదాం ల సమస్య ఉందని,ప్రైవేట్,ఫంక్షన్ హాల్ లను కూడా తీసుకుని ధాన్యం నిల్వ చేయాలని సూచించినట్లు తెలిపారు.కొనుగోలు తర్వాత రైతు,ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలు ట్రాక్ షీట్ కు మిల్లులు కు పొనవసరం లేదని అన్నారు.ప్రతి కొనుగోలు కేంద్రంకిఒక అధికారిని నియమించిమానిటర్ చేయాలని అన్నారు. రాష్ట్ర పశు సంవర్ధక శాఖ,మత్స్య,పాడి అభివృద్ధి,క్రీడలు యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీ హరి మాట్లాడుతూ ప్రభుత్వం సాహసో పేత నిర్ణయం తో పండించిన వరి ధాన్యం కొనుగోలు చేస్తుందని అన్నారు కొందరు ప్రభుత్వం ను అభాసు పాలు చేయటానికి విమర్శలు చేస్తున్నారని,అందరూ కలిసి కట్టుగా తిప్పి కొట్టాలని అన్నారు.

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ లు రాజకీయ పలుకుబడి ఉన్న వారికి కాకుండా లారీలు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు అప్ప చెప్పేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ధాన్యం సేకరణలో జిల్లా కలెక్టర్లు,అధికారులు అభినందించారు.

ప్రభుత్వ విప్,మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి,కేంద్ర ప్రభుత్వం సహకరించకున్నా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం సేకరణ దిగ్విజయం గా పూర్తి చేసిందని అన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోవనపర్తి జిల్లా మినహా మిగతా జిల్లాల్లో 2,3 రోజుల్లో పూర్తి అవుతుందని అన్నారు.ముఖ్యమంత్రి,పౌరసరఫరాల మంత్రి,మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులోఉంటూ అధికారులను అప్రమత్తం చేస్తూ ధాన్యం కొనుగోలు సజావుగా జరిగేలా కృషి చేశారనిఅన్నారు.రికార్డ్ స్థాయిలో సేకరణ జరిగిందన్నది కాదనలేని సత్యం అన్నారు.రైతులకు సకాలంలో చెల్లింపులు జరగటంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా రూ. 5 కోట్ల 34 లక్షల చెక్కును మహిళా సంఘాలకు కమిషన్ గా చెక్కును మంత్రి అందచేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

# పియు వేదికగా జాతీయ సదస్సులు

- పీఎం ఉషా నిధులతో జూలైలో నిర్వహణ
- హాజరు కానున్న దేశవ్యాప్తంగా ఉపకులపతులు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు
- మీడియాతో వివరాలు వెల్లడించిన పియూ వీసీ శ్రీనివాస్



మీడియాతో వివరాలు వెల్లడిస్తున్న పియూ వీసీ శ్రీనివాస్

**మహబూబ్‌నగర్ బ్యూరో,మే30, ప్రభాతవార్త:** రెండు జాతీయ సదస్సులకు పాలమూరు విశ్వవిద్యాలయం వేదిక కానున్నదని పియు ఉపకులపతి శ్రీనివాస్ తెలిపారు. పాలమూరు విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జూలై నెలలో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక రెండు రోజుల జాతీయ సదస్సు కు సంబంధించిన వివరాలను వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉచ్ఛతర్ శిక్ష అభియాన్ (పీఎం ఉషా) పథకం కింద రూ.35 లక్షల నిధుల సహకారంతో పాలమూరు విశ్వవిద్యాలయంలో రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సు దేశవ్యాప్తంగా ఉన్న ఉన్నత విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, పారిశ్రామిక రంగాల మధ్య సమన్వయం, సహకారం, జ్ఞాన మార్పిడికి ఒక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు.పీఎం ఉషాలో భాగంగా మల్టీడిసిప్లినరీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీస్ (ఎంఈఆర్‌యు) కాంపోనెంట్ కింద ఎంపికైన విశ్వవిద్యాలయాల ఉపకులపతులు ఈ సదస్సుకు హాజరవుతారని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి కేంద్ర విశ్వవిద్యాలయాలు, రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, ఉన్నత విద్యా నిపుణులు, పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు,విధాన నిర్ణేతలు ఈ సదస్సులో పాల్గొననున్నారని వివరించారు. ఈ యొక్క రెండు రోజుల జాతీయ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే మహబూబ్‌నగర్ మంత్రుల ద్వారా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని ఈ జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరు అయ్యేవిధంగా ప్రయత్నిస్తున్నామని ఉపకులపతి తెలిపారు. సదస్సులో భాగంగా దేశవ్యాప్తంగా పీఎం ఉషా కింద రూ.100 కోట్ల నిధులు మంజూరైన 27 విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, ప్రతినిధులు తమ సంస్థల అభివృద్ధి కార్యక్రమాలు, పరిశోధన ప్రాజెక్టులు, విద్యా సంస్కరణలు, వినూత్న కార్యక్రమాలను ప్రతిబింబించే ప్రత్యేక ప్రదర్శన స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నారని తెలిపారు.ఈస్టాల్స్ ద్వారా వివిధ విశ్వవిద్యాలయాల ఉత్తమ విధానాలు, అనుభవాలు మరియు విజయ గాథలను పరస్పరం పంచుకునే అవకాశం లభిస్తుందని చెప్పారు.సదస్సు రెండవ రోజు రూ.20 కోట్ల పీఎం ఉషా నిధులు పొందిన విశ్వవిద్యాలయాల ఉపకులపతులతో ప్రత్యేక ఇంటరాక్షన్ సెషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే రూ.10కోట్లు,రూ.5 కోట్ల నిధులు పొందిన విద్యాసంస్థల ప్రతినిధులతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని విజయవంతమైన పారిశ్రామికవేత్తలతో ప్రత్యేక చర్చా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దక్షిణ భారతదేశంలో ఈ తరహా జాతీయ స్థాయి పీఎం ఉషా మేరు సదస్సును నిర్వహిస్తున్న మొట్టమొదటి విశ్వవిద్యాలయంగా పాలమూరు విశ్వవిద్యాలయం నిలవడం ఎంతో గర్వకారణమని ఉపకులపతి పేర్కొన్నారు. ఈ జాతీయ సదస్సులో భాగంగా వివిధ పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య అవగాహన ఒప్పందాలు కుదుర్చుకునే కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.దీని ద్వారా విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, ఉపాధి అవకాశాలు, స్టార్టప్ పరిశోధన భాగస్వామ్యాలు విస్తరించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సదస్సు కోఆర్డినేటర్ ఓఎస్‌డీటు వైస్ ఛాన్సలర్ డా. డి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఉపకులపతి ప్రొ॥ జి.ఎన్. శ్రీనివాస్ దూరదృష్టి, ప్రణాళికాబద్ధమైన కృషి ఫలితంగానే ఈ జాతీయ స్థాయి సదస్సుకు సంబంధించిన ప్రతిపాదన ఆమోదం పొందిందని అన్నారు. దక్షిణ భారతదేశంలో మొట్టమొదటి సారిగా ఇలాంటి ప్రతిష్ఠాత్మక సదస్సును నిర్వహించే అవకాశం పాలమూరు విశ్వవిద్యాలయానికి లభించడం విశ్వవిద్యాలయ చరిత్రలో ఒకమైలురాయిగా నిలుస్తుందనిపేర్కొన్నారు.ఈ మీడియా సమావేశంలో ఓఎస్‌డీటు వైస్ ఛాన్సలర్ డా.డి.మధుసూదన్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి డా. కె.ప్రవీణ, పిఆర్‌ఓ డా. యం.గాలెన్న పాల్గొన్నారు.

# మేము పాలకులం కాదు.. ప్రజల సేవకులం..

- అసభ్యంగా మాట్లాడడం సరైన పద్ధతి కాదు
- దేవరకద్ర మున్సిపల్ చైర్మన్ దమయంతి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

**దేవరకద్ర, మే 30 ప్రభాతవార్త:** దేవరకద్ర మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు తాము పాలకులుగా కాకుండా ప్రజలకు సేవ చేసే సేవకులమని తెలిపారు. దేవరకద్ర పట్టణంలో రోడ్డు విస్తరణ అభివృద్ధి పనులు చేస్తుంటే ఒకటో వార్డ్ మున్సిపల్ కౌన్సిలర్ మాధవి, వారి సోదరులు అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం, వ్యక్తిగత విమర్శలకు దిగడం సరైన పద్ధతి కాదని మున్సిపల్ చైర్మన్ దమయంతి , కౌన్సిలర్లు అన్నారు. శనివారం దేవరకద్ర మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు మాట్లాడుతూ దేవరకద్ర మున్సిపల్ సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మక సూచనలు చేయడం ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని,ప్రజల సంక్షేమం పట్టణ ప్రగతి అందరి లక్ష్యంగా ఉండాలని సూచించారు. అభివృద్ధికి అడ్డంకులు సృష్టించడం మంచిది కాదని, ప్రజల సంక్షేమం ప్రాంత అభివృద్ధి లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు అందరి సహకారం అవసరమని ఐక్యతతో ముందుకు సాగితే దేవరకద్ర పట్టణం మరింత ప్రగతి సాధిస్తుందని మున్సిపల్ చైర్మన్ దమయంతి, వైస్‌చైర్మన్ యుగంధర్‌రెడ్డి, కౌన్సిలర్లు అన్నారు. పాలన విషయంలో నా భర్త జోక్యం లేదు, అతనిపై అనవసరంగా అబాండాలు వేయడం సరికాదు. మేము ఎక్కడైనా అవినీతికి పాల్పడినట్లు రుజువు చేస్తేనా చైర్మన్ పదవికి రాజీనామా చేస్తానని పత్రికసమావేశంలో సవాలు విసిరారు.ప్రజల సమస్యల పరిష్కారం ప్రాంత అభివృద్ధి సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల సహకారం ఆశీర్వాదాలతో మరింత సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు అన్నారు.

**సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో**

# తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా




**ఆత్మకూర్ మే30, ప్రభాతవార్త:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమవుతున్నాయని పాలకులు తక్షణమే ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలంటూ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ కార్యవర్గ సభ్యులు కె. సూర్యం మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కరించకపోగా పెట్రోల్ మరియు డీజిల్ ధరలు పెంచి సామాన్య ప్రజలపైఅదనపు భారంమోపడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.దేశవ్యాప్తంగా ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతుంటే బిజెపి ప్రభుత్వం మాత్రం ప్రజల మధ్యన కులం , మతం పేరుతో విభజిస్తూ పబ్బం గడుపుకుంటున్నారని తీవ్రస్థాయిలో ఆరోపించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గత శాసనసభ ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక వాగ్దానాలు ఇచ్చినప్పటికీ వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారని కనీసం రైతులకు రైతు బీమా వర్తింపజేయడంలో కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసనితులు విడుదల చేయడంలో జరుగుతున్న జాప్యంపట్ల రైతులు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు పూనుకోక ముందే ప్రస్తుతఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతు భరోసానితులను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపథకం అమలు చేయడంలో లబ్ధిదారుల ఎంపికకే కాలయాపన చేస్తూ ప్రజలకు మొండి చేయి చూపిస్తున్నారని అన్నారు.ప్రజా సమస్యల పరిష్కరించడంలో ప్రభుత్వ వైఫల్యాలను తీవ్రస్థాయిలో ఎండగట్టేందుకు ప్రజలు స్వచ్ఛం దంగా సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన విజ్ఞప్తి. అనం తరం తాసిల్దార్ జె కే మోహన్ కు సమస్యలతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆత్మకూర్ సబ్ డివిజన్ నాయకులు ప్రసాద్ మండల నాయకులు వెంకటన్న, ప్రేమరత్, కురుమన్న, పాటుగా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎవరి కులం ఎంతో వారికీ అంతా వాటా కావాలి

- బీసీ, ఎస్సి, ఎస్టీ (జె ఎసి) రాష్ట్ర కార్యదర్శి గుడిసె బాలయ్య ముదిరాజ్
- బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపు



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న (జె ఎసి) రాష్ట్ర కార్యదర్శి గుడిసె బాలయ్య ముదిరాజ్

**దేవరకద్ర, మే 30 ప్రభాతవార్త:** ఎవరి కులం ఎంతో వారికీ అంతా వాటా కోసం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం లో జరిగే భారీ బహిరంగ సభకు దేవరకద్ర నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో కదిలి రావాలనిబీసీ, ఎస్సి, ఎస్టి (జెఏసి )రాష్ట్ర కార్యదర్శి గుడిసె బాలయ్య ముదిరాజ్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన దేవరకద్ర కేంద్రంలో జెఎసి బహిరంగ సభవాల్ పోస్టర్ ను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్టంలో ఎవరి కులం ఎంతో వారికంత వాటా రావాలని ఆయన డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం రాజ్యాధికారం కై 90 ఉన్నా బిసి, ఎస్సి, ఎస్టీ ప్రజలు ఏకమై సాధించుకుందామన్నారు. రాష్టంలో రెండు, మూడు కులాల నాయకత్వం అధికారంలో ఉంటూ బీసీ, ఎస్సి,ఎస్టి లను అణగదొక్కుతున్నారని వారి రాజ్యాంగ హక్కులను కూడా కాలరస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్రం వచ్చినప్పటినుంచి అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం లేదని విమర్శలు చేశారు. బీసీ లకు రాజకీయ వాటా కావాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జూన్ 14న ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగే బహిరంగ సభ కు జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు, ఉద్యోగులు, కుల సంఘాల నాయకులు, మేధావులు,విద్యార్థి సంఘాల నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె. శ్రీనివాస్‌లు ముదిరాజ్, టి.సత్యనారాయణ, గణేష్ ముదిరాజ్, వి.హన్మంత్, ఎస్, సత్యనారాయణ, రాము, జగన్, రిటర్డ్ ఏఎస్ఐ వెంకటయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖలో అందించిన సేవలు అభినందనీయం

### నారాయణ పేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణ పేట, మే 30 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పదవీ విరమణ పొందిన ధన్వాడ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ఎం.ఏ. సమ్మద్, నర్వ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కె. ఆంజనేయులును జిల్లా ఎస్పీ డా.వినీత్ ఘనంగా సన్మానించారు. పూలమాలలు,శాలువాలతో సత్కరించి స్వీట్లు పంచారు. పోలీస్ శాఖకు వారు అందించిన విశిష్ట సేవలను ఎస్పీ కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని, ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. పోలీస్ శాఖ నుంచి రావాల్సిన అన్ని బెనిఫిట్స్ త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.పదవీ విరమణ పొందిన సిబ్బందికి పోలీస్‌శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ భరోసా ఇచ్చారు.ఈ సన్మాన కార్యక్రమంలో డీఎస్పీ మహేష్, సీఐలు శివ శంకర్, రామ్ లాల్, ఎస్ఐలు నరేష్, రమేష్, వెంకటేష్ గౌడ్, పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సజావుగా వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.రబీ సీజన్లో జిల్లావ్యాప్తంగా దొడ్డు రకం వరి 731 హెక్టార్లలో సాగు చేయగా 5487 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా వేశామని తెలిపారు. అలాగే సన్నరకం వరి 30,576 హెక్టార్లలో రైతులు సాగు చేయగా 2,29,323 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరిగినట్లు చెప్పారు. ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రెండు రకాల వరి కలిపి 49,244 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చిందని, ఇందులో 48,015 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు. 6761 మంది రైతుల నుంచి రూ.114.71 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేయగా ఇప్పటివరకు రూ.105.15 కోట్ల డబ్బులను చెల్లించడం జరిగిందన్నారు.150 వాహనాల ద్వారా కేటాయింపులు జరిగిన 38 మిల్లులకు 47,998 మెట్రిక్ టన్నుల ధాన్యంను తరలించామన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్ లు, తేమ కొలిచే మీటర్స్, ఎలక్ట్రానిక్ తూకాలు, ప్యాడి క్లీనర్స్, తదితర కొరత లేకుండా అవసరమైన సౌకర్యాలని కల్పించినట్లు తెలిపారు. తరగు, తాలు పేరిట ఎక్కడైనామిల్లర్లు, ట్రేడర్లు రైతులకునష్టం చేకూరేలా వ్యవహరించకుండా తగు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యమును కూడా కొనుగోలు చేస్తున్నామని, రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటి నుంచి తరచూ తనతో పాటు సంబంధిత జిల్లాఅధికారులు పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీలు చేస్తూ కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా జరిగేలా తగు చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు.పిఎసిఎస్, మార్క్ఫెడ్, వ్యవసాయ శాఖఅధికారుల సమన్వయంతో జిల్లాలోఎనిమిది మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది అత్యధికంగా జిల్లాలో 89,383 ఎకరాల్లో మొక్కజొన్నను రైతులు సాగు చేశారన్నారు. ఇప్పటివరకు ఆయా కొనుగోలు కేంద్రాల ద్వారా 60,085 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనడం జరిగిందని, వీటి విలువ సుమారు రూ.36 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు.ప్రభుత్వ గోదాములతో పాటు అవసరమైన చోట ప్రైవేటు గోదాములను కూడా అద్దెకు తీసుకొని మొక్కజొన్న నిలువ చేసామన్నారు. లారీల కొరత వంటి సమస్యలనుకూడా పరిష్కరించిత్వరితగతినతూకం చేసిన మొక్కజొన్నను గోదాము లకు తరలిస్తున్నామన్నారు. ఈ నెలాఖరుకు జిల్లాలో ఆయా కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల నుంచి కొనుగోలు చేసే ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు.అలాగే తరచు సంబంధిత అధికారులతో గూగుల్ మీట్ ద్వారా కొనుగోలు ప్రక్రియపై సమీక్ష నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను జిల్లాలో విజయవంతం చేస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.

## ప్రజల భద్రతలో రాజీ లేదు

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేకకార్యచరణను అవలంబిస్తూ, ఓపెన్ డ్రింకింగ్, గ్యాంబ్లింగ్, గేమింగ్, మట్కా లాంటి వాటిని పూర్తిగా రూపుమాపేల కృషి చేయాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, వనపర్తి డీఎస్పీ గిరిబాబు, డిసిఆర్బీ డీఎస్పీ,బాలాజీ నాయక్, వనపర్తి సీఐ సుగంధ రత్నం, కొత్తకోట సీఐ,రాంబాబు, ఆత్మకూరు సీఐ శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, వనపర్తి జిల్లాలోని ఎస్సైలు, డిసిఆర్బి, ఐటి కోర్, కమ్యూనికేషన్, ఫింగర్ ప్రింట్స్,విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను వ్యతిరేకించాలి

(మొదటి పేజీ తరువాయి)

పోక్సో చట్టంపై అవగాహన ఉండాలని తెలిపారు.ఈ సందర్భంగా మహిళా సంఘాలకు వరి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన కమిషన్ చెక్కులను,ఎఫ్‌పిఓ సంఘాలకు సంబంధించిన చెక్కులను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. అదేవిధంగా బాలికల సంరక్షణకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో డిఆర్డిఓ ఉమాదేవి, డీఎస్పీ బాలాజీ నాయక్,డిసిఓరాణి, డిఐఓ జ్యోతి, డిడబ్ల్యుఓ సుధా రాణి, డిఎంహెచ్ఓ సాయినాథ్‌రెడ్డి, డిఐఈఓ నరేంద్ర, కేజీబీవీ అధికారిని,మహిళాసమాఖ్య అధ్యక్షురాలు, విద్యార్థులు, స్నేహ సంఘాల బాలికలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలలో నాయకత్వ లక్షణాలు అవసరం

(మొదటి పేజీ తరువాయి)

సంఘాల ద్వారా విద్యార్థినులు సామాజిక సమస్యలను గుర్తించి వాటిపై చర్చించడం, నిర్ణయాత్మక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ఎంతో అభినందనీయమని ఆయన అన్నారు. మాక్ పార్లమెంట్ వంటి వేదికలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడమేకాకుండా ప్రజాస్వామ్య విలువలపై అవగాహనను పెంపొందిస్తాయని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. బాలికలు విద్యలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటిని సాధించేందుకు క్రమశిక్షణతో కృషి చేయాలని ఆయన సూచించారు. కుటుంబం మరియు సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ గుర్తు చేశారు.కొంతమంది బాలికలు దూరప్రాంతాలకు బస్సులు లేకపోవడం చదువుకు దూరం అవుతున్నామని తెలపడంతో అందుకు కలెక్టర్ స్పందించికిషోర బాలికలకు సైకిల్ లను అందజేయనున్నట్లు కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమరేందర్, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు, అదనపు పీడీరాజేశ్వరి, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి ఉమాపతి, వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాల నాయకులు, మహిళలు, విద్యార్థినిలు, తదితరులు పాల్గొన్నారు.



మంత్రులను ఘనంగా స్వాగతం పలికిన దేవరకద్ర ఎమ్మెల్యే

## 1400 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు

(మొదటి పేజీ తరువాయి)

సంతోషంతో మంత్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ జేఎల్బి హరిప్రియ, ఎస్పి డి. జానకి, అజిలాపూర్ సర్పంచ్ అనంతమ్మ,మాజీ జెడ్పి చైర్మన్‌స్వర్ణసుధాకర్ రెడ్డి, డి.ఎస్.పి వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ, ఎస్సై నాగన్న, మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి,కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావు, మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఫారుక్ అలీ, అంజన్ కుమార్ రెడ్డి,కౌకుంట్ల సర్పంచ్ నరేష్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాసరావు, వివిధ మండలాల నాయకులు, సర్పంచ్లు, అధ్యక్షులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

రాడ్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## నియోజకవర్గానికి ఓ మహిళా సూపర్ మార్కెట్

(మొదటి పేజీ తరువాయి)

వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా జరిగిన కృతజ్ఞత సభలో వేలమంది మహిళలు పాల్గొని ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో రైస్ మిల్లులు, ఇతర పారిశ్రామిక యూనిట్ల నిర్వహణలో కూడా మహిళలకు అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారే పల్లి సురేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లునర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

